## గుంతమర్పల్లి వ్యవసాయ పొలంలో మొసలి



గుంతమర్పల్లి వ్యవసాయ పొలంలో మొసలి

**ఝరాసంగం, జూన్ 11, ప్రభాతవార్త:** మండలంలోని గుంతమర్పిల్లి గ్రామంలోని వ్యవసాయభూమిలో మంగళవారం మొసలి ప్రత్యక్షమయింది. గ్రామంలోకి మొసలి వచ్చిన వార్త గ్రామంతో పాటు మండలంలో దహనంలా వ్యాపించడంతో ప్రజలు పెద్ద సంఖ్యలో సంఘటన స్థలానికి చేరుకుని మొసలిని వీక్షించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సంజీవరావు, డిప్యూటీ తహసీల్దార్, గిర్దవార్, ఎస్ఐ రామారావు, జేందర్‌రెడ్డిలు సంఘటన స్థలానికి చేరుకుని మొసలి ఉన్నట్లు గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు.




మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త


## బిసి గురుకుల పాఠశాలకు సొంత భవనం కేటాయించాలి

### ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్

**హుస్నాబాద్, జూన్ 11, ప్రభాతవార్త :** హుస్నాబాద్‌లోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల పాఠశాల, కళాశాలలు అద్దె భవనంలో కొనసాగుతున్నాయని ఈ విషయంపై ఎమ్మెల్యే మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టిసారించి సొంత భవనం నిర్మించేలా కృషి చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్ డిమాండ్ చేశారు. మంగళవారం జనార్ధర్ విడుదల చేసిన ప్రకటనలో హుస్నాబాద్‌కు మంజూరైన ఈ పాఠశాల, కళాశాల గత 6 సంవత్సరాలుగా అద్దె భవనంలో కొనసాగుతుందని, సొంత భవనం లేక అద్దె భవపంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత సంవత్సరం పాఠశాల కళాశాలగా అప్‌గ్రెడ్ అయిననుండి విద్యార్థులకు తరగతి గదులు సరిపోకపోతుండడంతో ఇక్కడి విద్యార్థులను వర్గల్ పాఠశాలకు అనుసందానం చేశారని ఈ సంవత్సరం కూడా ఇక్కడికి వచ్చిన అడ్మిషన్‌లను చేర్చుకుని చదువుకునేందుకు వర్గల్‌కు పంపుతున్నారన్నారు. ఇక్కడ భవనం సరిపోకపోవడంతోనే విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని కావున వెంటనే మంత్రి ప్రభాకర్ స్పందించి సొంత భవనాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు.



మంత్రికి ఆహ్వానపత్రం అందచేస్తున్న ఎమ్మెల్యే

## 20న తెల్లాపూర్ మున్సిపల్ భవనం ప్రారంభోత్సవం

### -హాజరుకానున్న మంత్రి దామోదర్ రాజనర్సింహా

**రామచంద్రాపురం, జూన్ 11, ప్రభాతవార్త:** ఈ నెల 20వ తేదీన తెల్లాపూర్ మున్సిపల్ పరిపాలన భవనంను ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహాను మున్సిపల్ పాలకవర్గం సభ్యులత కలిసి ఆహ్వానించినట్లు తెలిపారు. ఆధునిక హంగులతో విశాల ప్రాంగణంలో నిర్మించిన భవనాన్ని ప్రారంభించుకోవడంతోపాటు గద్దర్ ఆడిటోరియం నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమాలను మంత్రి దామోదర్ రాజనర్సింహా చేతుల మీదుగా నిర్వహించబోతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సోమిరెడ్డి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూం ఇళ్లపై సర్వే చేయాలి

### -మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందజేత



మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**గజ్వేల్ టౌన్, జూన్ 11 (ప్రభాతవార్త):** గత ప్రభుత్వ హయాంలో గజ్వేల్ పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా పంపిణీచేసిన డబుల్ బెడ్ రూం ఇళ్లపై సర్వేచేయాలని కోరుతూ గజ్వేల్ నియోజకవర్గ నాయకులు మంగళవారం సెక్రటేరియట్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్, మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే చేసి అర్హులైన వారిని గుర్తించి డబుల్ బెడ్‌రూం ఇండ్లను పంపిణీ చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

## బైపాస్ రోడ్డుకు భూములు ఇవ్వం

### బలవంతంగా గుంజుకుంటే ఆత్మహత్యలే శరణ్యం...

### ఆర్డీవో రమాదేవి ముందు మొరపెట్టుకున్న బాధితులు



బైపాస్ రోడ్డు బాధితులతో మాట్లాడుతున్న మెదక్ ఆర్డీవో రమాదేవి

**రామాయంపేట, జూన్ 11, ప్రభాతవార్త :** తాము ఎట్టి పరిస్థితుల్లో బైపాస్ రోడ్డుకు విలువైన తమ భూములను ఇవ్వబోమని, ఒకవేళ అధికారులు బలవంతంచేసి గుంజుకునే ప్రయత్నాలుచేస్తే పురుగుల మందు తాగి ఆత్మహత్యలు చేసుకుంటామని బాధిత రైతులు స్పష్టం చేశారు. మంగళవారం రామాయంపేటలోని తహశీల్దార్ కార్యాలయంలో మెదక్ ఆర్డీవో రమాదేవి బైపాస్ రోడ్డు రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. త్వరలో బైపాస్ రోడ్డు పనులు ప్రారంభమవుతాయని, రైతులు తమ భూములను ఇవ్వాలని కోరడంతో బాధిత రైతులందరూ నిరాకరించారు. తాము ఎన్నోసార్లు రెవెన్యూ అధికారులకు తమ భూములు ఇవ్వమని స్పష్టం చేశామని, బైపాస్ రోడ్డు కాకుండా ఊర్లో నుంచి వారు స్పష్టం చేశారు. దీంతో ఆర్డీవో రమాదేవి చేసేది ఏమి లేక ఉన్నతాధికారులకు మీ నిర్ణయం తెలియజేస్తానని చెపినట్లు బాధితుడు ఎర్రం నాగరాజు గుప్తా తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో కూడా తమ భూములు ఇవ్వమని తెగేసి చెప్పామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భూములు కోల్పోతున్న రైతులు, ఫ్లాట్ల భవనాల యజమానులు పాల్గొన్నారు. సంబంధించిన స్థలాన్ని ఇవ్వమని బాధితులు ఆర్డీవో రమాదేవికి వినతిపత్రం కూడా ఇచ్చారు.

## పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయండి

### -నేర సమీక్ష సమావేశంలో డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి

**జహీరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి సూచించారు. మంగళవారం డివిజన్ పరిధిలోని ఆయా పోలీసు ఠాణా ఎస్ఐలతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ఠాణాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను ఛేధించి భాధితులకు న్యాయం చేయాలన్నారు. పోలీసు ఠాణాలకు వచ్చే ఆధితులకు పోలీసు శాఖ తరఫున సహాయ సహకారాలు అందించి వారికి న్యాయం జరిగే విధంగా చూడాలని సూచించారు. రౌడీలు, నేరస్తుల పట్ల నిఘా ఉంచాలన్నారు. ప్రతి నెల ఒక మారు నేరాలపై సమీక్ష చేసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో పట్టణ, రూరల్ సిఐలు ఆర్ రవి, నయిమొద్దిన్, జహీరాబాద్ రూరల్, పట్టణ, చిరాగ్‌పల్లి, చిరాగ్ పల్లి, కోహీర్, ఝరాసంగం, రాయికోడ్, హద్నూర్ ఎస్ఐలు లక్ష్మారెడ్డి, వరప్రసాద్, నరేష్, కృష్ణ, రాజేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రామానాయుడు ఉన్నారు.



అధికారులతో నేరసమీక్ష నిర్వహిస్తున్న డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి

## బడిబయట పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్.. జక్కపల్లిలో గ్రామంలో జిల్లా కలెక్టర్ పల్లెనిద్ర.. మోడల్ స్కూల్‌లో రాత్రి బస చేసిన కలెక్టర్

**నర్సాపూర్, జూన్ 11, ప్రభాతవార్త :** బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ నర్సాపూర్ మండలం జక్కపల్లి గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రాత్రి జక్కపల్లి మోడల్ స్కూల్‌లో బసచేశారు. మంగళవారం ఉదయం 6 గంటలకు జిల్లా కలెక్టర్ జక్కపల్లిలోనూ, జక్కపల్లి తండాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఇంటింటికి తిరిగి బడి బయట ఉన్న పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. తండాలోనూ ఆయన ఇంటింటికి తిరిగి చదువుకుంటే కలిగే లాభాలను వివరించారు. గ్రామంలో 250పైగా కుటుంబాలుండగా 100 శాతం ఇంటింటికి అధికారులతో తిరిగి చదువు ఆవశ్యకతను వివరించారు. అనంతరం రాహుల్‌రాజ్ మాట్లాడుతూ పిల్లలు బడి బయట ఉండకుండా బడికి పంపించేవిధంగా చేసేందుకు ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. ఇందులో భాగంగా జక్కపల్లిలో పల్లెనిద్ర నిర్వహించి ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులకు చదువుపై అవగాహన కల్పించామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించామని తెలిపారు. ఈనెల 12 నుండి ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని చెప్పారు. గ్రామంలో బడిబయట పిల్లలు ఎవరూ ఉండకూడదన్నారు. ప్రభుత్వ పాటశాలలు ప్రారంభం కాగానే అందరికి స్కూల్ యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్కులతోపాటు అన్ని వసతులు కల్పించి మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ మేరకు పిల్లలతో ఆయన మాట్లాడారు. అంతేగాక ఎవరైన పిల్లలు పదవతరగతి, ఇంటర్మీడియెట్‌తో చదువును ఆపివేసినట్లయితే వారితో మాట్లాడి సరైన కాలేజీలో ఆడ్మిషన్ వచ్చేలాగ చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు.



ప్రజలకు, పిల్లలకు చదువుపై అవగాహన కల్పిస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులు.

అంతేగాక అమ్మ ఆదర్శ పాఠశాలలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, ఎంపిడివో మధులత, తహసీల్దార్ కమలాద్రి, మండల విద్యాధికారి బుచ్యా నాయక్, ఎంపివో వైద్య శ్రీనివాస్, జక్కపల్లి మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్, వెంకటలక్ష్మి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు నిబద్ధతతో పనిచేయాలి : ఎమ్మెల్యే

**నారాయణఖేడ్ టౌన్, జూన్ 11, ప్రభాతవార్త:** ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు అధికారులు నిబద్ధతతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం ఎంపిపి అధ్యక్షురాలు చాందీ బాయి చౌహాన్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 5 సంవత్సరాలు ప్రజా సేవ చేసిన ఎంపిటిసి సభ్యులకు ఎమ్మెల్యే అభినందించారు. కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలు చోటు చేసుకుంటున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఏఈఓను జాయింట్ కలెక్టర్ సస్పెండ్ కూడా చేశారని, అవకతవకలపై మరో మారు క్రాస్ వెరిఫికేషన్ చేయిస్తామని, అవకతవకలకు పాల్పడిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్నం పెట్టే అన్నదాతలను ఆగం చేయడం అన్యాయం, పాపం అన్నారు. ఉపాధి హామీ పనుల్లో తప్పిదాలు చోటుచేసుకుంటున్నాయని, లేబర్ కార్డు లేని వారు పనులు చేస్తున్నట్లు తెలుస్తోందని, కూలీల హాజరు, కూలి డబ్బుల విషయంలో తప్పిదాలు జరుగుతున్నాయని, అధికారులు వెంటనే సరిచేసుకోవాలని సూచించారు. 200లోపు విద్యుత్‌ను వాడినా అనేకులకు జీఓ బిల్లు రావడం లేదని, అధికారులు తగువిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ అధికారులు సక్రమంగా విధులు నిర్వహించడంలేదని, చేతులు తడిపితే కాని పనులు జరగడం లేదని తెలుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు పని తీరు మార్చుకోవాలని, త్వరలోనే రివ్యూ సమావేశం నిర్వహిస్తామన్నారు. గత ప్రభుత్వంలో నియోజకవర్గానికి డబ్బులు ఉన్నా పనులు ఎందుకు చేయలేదని, బైఫరికేషన్ ఎందుకు చేయలేదని అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాల్సిన అవసరం ఉందని, అందుకు తన సహకారం పూర్తిగా ఉంటుందని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ పైప్ లైన్ ఎక్కడ లీకేజి అయినా వెంటనే సరిచేయాలని సూచించారు. సర్వే సమస్యలు తాండవిస్తున్నట్లు తెలుస్తోందని, సమస్య పరిష్కారానికి రెవిన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి


మిల్లెట్ యూనిట్‌ను ఇటీ వలే మొదలు పెట్టారని, అటువైపుగా వెళ్లిన ప్రతిసారి అది మూసే ఉంటోందని విచారం వ్యక్తం చేశారు. మిల్లెట్ ఆహారంపై ప్రజలకు ప్రత్యేకంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. వేస్ట్ రిసైక్లింగ్ యూనిట్ సైతం నిరుపయోగంగా ఉందని, యూనిట్ పని చేయటానికి కావాల్సిన అవసరాలను తన దృష్టికి తేవాలని అధికారులకు సూచించారు. వర్షాకాలం మొదలవుతున్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా ఎవరికి వారు చూసుకోవాలని, ఆరోగ్య శాఖ తమ విధులను అప్రమత్తంగా నిర్వహించాలని వివరించారు.

ఈ కార్యక్రమంలో జడ్పీటిపి సభ్యులు లక్ష్మీ బాయి, ఎంపిడిఓ, తహసీల్దార్, ఎస్ఐ, ఎంపిటిసి సభ్యులు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

### రోడ్డుకిరువైపులా నిలిచిపోయిన వాహనాలు

**చిన్నశంకరంపేట, జూన్ 11, ప్రభాతవార్త:** పట్టణంలో మంచి నీరు ఖాళి బిందెలు పట్టుకొని మహిళలు రోడ్డెక్కారు. చిన్న శంకరంపేటలోని గాంధీ నగర్ కాలనీలో రెండు మూడురోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ వారు పట్టించుకోవడం లేదని వాపోయారు. కాలనీకి నీరు సరఫరా అయ్యే బోరు మోటరు చెడిపోయి పది రోజుల గడుస్తున్నా ఏ అధికారీ పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ వాసులు మెదక్-చేగుంట రహదారిపై ధర్నా చేయడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీవో దామోదర్ నిరసన వ్యక్తం చేస్తున్న మహిళల వద్దకు చేరుకొని సమస్యను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడతానని, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. చెడిపోయిన బోరు మోటారును వెంటనే మరమ్మతులు చేయించి, మరోసారి నీటి సమస్యల తలెత్తకుండా చూస్తానని హామి ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు. గత ఎప్రిల్ 30వ తేదిన కూడ కాలని వాసులు నీటి కోసం నిరసన వ్యక్తం చేయడం తెలిసిందే. మిషన్ భగీరథ అధికారులు, గ్రామ పంచాయతీ అధికారుల మధ్య సమనన్వయ లోపంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నీరు రావు అనే విషయమైన ముందస్తుగా సమాచారం ఇచ్చినా సరిపోయేదని వారు అసహనం వ్యక్తం చేశారు.



గాంధీనగర్ కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎంపీడీవో దామోదర్

## గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం

### టీ దుకాణాల కంటే ముందే బెల్టుషాపులు తెరుస్తున్న వైనం... చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

**చేర్యాల, జూన్ 11, ప్రభాతవార్త :** చేర్యాల, మద్దూరు, దూళ్మిట్ట మండలాల్లో మద్యం ఏరులై పారుతోంది. గ్రామాల్లో టి దుకాణాల కంటే ముందే బెల్టుషాపులు తెరుస్తున్నారు. ఉదయం 6 గంటలకే దుకాణాలు తీసి మందుబాబులను మద్యం తాగేందుకు ఆహ్వానిస్తున్నారు. ఇంటికి పెద్ద దిక్కు, చేసిన కష్టమంతా బెల్టు దుకాణాల పాలవుతోందని, ఫలితంగా కుటుంబాలు రోడ్డునపడుతున్నాయ మహిళలు ఆరోపిస్తున్నారు. కొంత మంది మద్యానికి బానిస కావడంతో మహిళలు చేసేదేమీ లేక కుటుంబ పోషణ కోసం కూలీ పనులకు వెళ్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణం దెబ్బ తినడంతో పాటు ఘర్షణలు మొదలవుతున్నాయి. గ్రామాల్లో నిత్యావసర సరుకులు దొరికే కిరాణాషాపుల్లోనూ బెల్టుషాపు కేంద్రాలుగా విరజిల్లుతున్నాయి. గ్రామాల్లో జాతరలు నిర్వహిస్తే మద్యం బెల్టుషాపులు వేలం పాటలు నిర్వహిస్తున్నారంటే అమ్మకాలు ఎంత జోరుగా, బహిరంగంగా జరుగుతన్నాయే తెలుస్తుంది. బెల్టుషాపుల యజమానులతో అధికారులు కుమ్మక్కైయ్యారు కాబట్టె గ్రామాల్లో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని పలువురు తెలుపుతున్నారు. పచ్చగా ఉండాల్సిన సంసారాలు కుప్పకూలిపోతున్నాయి.



గ్రామంలో మద్యం అమ్ముతున్న వారితో వాగ్వాదానికి దిగుతున్న మహిళలు

యువకులు మద్యానికి బానిసలై తమ భావితరానికి వారే ముళ్లబాటలను వేసుకుంటున్నారు. ప్రతి గ్రామంలో పుట్టగొడుగుల్లా బెల్టు షాపులు పుట్టుకొస్తున్నాయని వాటిని అధికారులు ప్రోత్సహించకుండా ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

**చిట్యాలలో బెల్టు షాపులపై మహిళలు దాడులు...**

చేర్యాల మండలం చిట్యాల గ్రామంలోని బెల్టు షాపుల నిర్వాహకుల ఇండ్లపై మహిళలు దాడులకు దిగారు. గ్రామంలో సుమారు 25 బెల్టు దుకాణాలు ఉన్నాయని దీంతో ఇంటి పెద్ద తాగుడుకు బానిసై ఇండ్లలో నిత్యం ఘర్షణలు చేస్తున్నారని, పొద్దంత కష్టపడిన సొమ్మంతా సాయంత్రం మద్యం పాలుచేసి కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారని రెండు రోజులుగా గ్రామంలోని బెల్టు దుకాణాలపై దాడులు చేశారు. యువత మద్యంకు బానిసగా మారి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో బెల్టు షాపులు నిర్వహిస్తున్న వారిపై చర్యలు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

## కాట్రియాల గ్రామంలో పల్లెనిద్ర....

**రామాయంపేట, జూన్ 11, ప్రభాతవార్త :** కలెక్టర్ ఆదేశాల మేరకు రామాయంపేట మండలం కాట్రియాల గ్రామంలో సోమవారం రాత్రి పల్లె నిద్ర, బడిబాట నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు గ్రామంలో పర్యటిస్తూ బడి మానేసిన పిల్లలను గుర్తించి తల్లిదండ్రులతో మాట్లాడి బడికి పంపేవిధంగా ప్రోత్సహించడం జరిగింది. కొత్తగా చదువుకోవడానికి సిద్ధంగా ఉన్న బడిపిల్లలను గుర్తించడం వారికి బడిలో ప్రవేశం కల్పించేలా చర్యలు తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ ప్రత్యేక అధికారి, మండల వ్యవసాయాధికారి రాజ్‌నారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుకున్నప్పుడే బంగారు భవిష్యత్తు ఉంటుందని ఎట్టి పరిస్థితుల్లో చదువు మానేయకూడదని చదువుకోవడం వల్ల కలిగేటువంటి ప్రయోజనాలగూర్చి విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు వివరించడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా ఉన్నత పరిషత్ పాఠశాల, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పంచాయతీ సెక్రెటరీతో పాటు వివిధ శాఖలకు సంబంధించిన గ్రామస్థాయి అధికారులు ఈ బడిబాట కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## స్విమింగ్‌పూల్‌లో పడి విద్యార్థి దుర్మరణం

**సిద్దిపేట రూరల్, జూన్ 11, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని స్విమింగ్‌పూల్‌లో పడి విద్యార్థి మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. పోలీసు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణానికి చెందిన గిరీష్(17) సిద్దిపేటలో బంధువుల ఇంటికి వచ్చినట్లు తెలిపారు. స్విమింగ్ ఫూల్‌లో ఈతకు వచ్చి ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు బాసర ట్రిబుల్ ఐఐటి చదువుతున్నట్లు తెలిసింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పిడుగు పాటుతో రైతు మృతి

**తొగుట, జూన్ 11, ప్రభాతవార్త :** పిడుగు పాటుతో రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని జప్తిలింగారెడ్డిపల్లి గ్రామంలో జరిగింది. గ్రామస్తులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శ్రీశైలం(45) ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురుస్తుండగా వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న క్రమంలో పిడుగు పడి స్పృహకోల్పోయి ప్రాణపాయ స్థితిలో ఉండగా వైద్య చికిత్స నిమిత్తం సిద్దిపేటకు తీసుకెళ్లారు. చికిత్సపొందుతూ శ్రీశైలం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు.

## పిడుగు పాటుకి 11 గొర్రెలు 1 మేక మృతి



మృతి చెందిన గొర్రెలు

**దుబ్బాక (అక్బర్‌పేటభూంపల్లి), జూన్ 11, ప్రభాతవార్త:** పిడుగు పడి 11 గొర్రెలు 1 మేక మృతి చెందిన సంఘటన మంగళవారం అక్బర్‌పేట భూంపల్లి మండలం చిన్ననిజాంపేట గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొనాపురం పెంటయ్య గొర్రెల కాపరి, తనకున్న కొద్దిపాటి గొర్రెలను కాస్తూ కుటుంబాన్ని పోషించుకునే వాడన్నారు. రోజు మాదిరిగానే మంగళవారం గొర్రెలను మేత మేపడానికి గ్రామ సరిహద్దు ప్రాంతంలోకి వెళ్లాడు, హఠాత్తుగా మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గొర్రెలు మేస్తుండగా పిడుగు పడడంతో 11 గొర్రెలు, ఒక మేక మృతి చెందిందన్నారు. వీటి విలువ ఒక లక్ష 50 వేల వరకు ఉంటుందన్నారు. ప్రభుత్వం వెంటనే బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు చోరీ



ఆసుపత్రిలో శంకరమ్మను విచారిస్తున్న ఎస్ఐ విజయ్‌కుమార్

**ములుగు, జూన్ 11 (ప్రభాతవార్త):** మహిళ తలపై సుత్తితో బాది ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును దుండగులు ఎత్తుకెళ్లిన సంఘటన ములుగు మండల పరిధిలోని మామిడ్యాల ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...తునికి బొల్లారం గ్రామానికి చెందిన శ్యామల శంకరమ్మ(45) మామిడ్యాల గ్రామంలోని ఎస్సీ కాలనీలో కిరాయికి ఉంటూ జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో వాకింగ్ నిమిత్తం వంటిమామిడి వైపు వెళ్లి వస్తుండగా ఆటోలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి శంకరమ్మ తలపై సుత్తితోబాది 4 తులాల బంగారు పుస్తెలతాడును ఎత్తుకెళ్ళినట్లు తెలిపారు. దీంతో ఆమె తలకు బలమైన గాయం కావడంతో స్పృహ కోల్పోయి పడి ఉండడాన్ని గమనించిన వాహనదారులు వెంటనే స్థానికంగా ఉన్న ఆర్‌విఎం ఆసుపత్రికి తరలించారు. వారి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

## అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

**చేర్యాల, జూన్ 11, ప్రభాతవార్త :** అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను సోమవారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా నంగునూరు మండలం ఖాతా నుండి చేర్యాలకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని నమ్మదగిన సమాచారం అందడంతో చేర్యాల పట్టణంలో ట్రాక్టర్లను పట్టుకుని తహసీల్దారు కార్యాలయంకు తరలించారు.

**నేడు ఇసుక వేలం పాట...**

మండలంలోని కమలాయపల్లి గ్రామ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను కొద్ది రోజుల క్రితం అధికారులు సీజ్ చేసిన విషయం విదితమే. కాగా 15 ట్రాక్టర్ల ఇసుకను బుధవారం చేర్యాల తహశీల్దారు కార్యాయలంలో వేలం వేయనున్నట్లు ఆర్ఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు.



రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు



కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీలో ఎంపి సురేశ్‌కుమార్ శెట్కార్

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎంపి విజయోత్సవ ర్యాలీ

### -పాల్గొని అభివాదం చేసిన ఎంపి శెట్కార్

**జహీరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌కుమార్ శెట్కార్ భారతీయ జనతా పార్టీ అభ్యర్థి బిబి పాటిల్‌పై ఘన విజయం సాధించినందుకు మంగళవారం జహీరాబాద్ పట్టణంలో మాజీ మంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భారీగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని బాగారెడ్డి చౌరస్తా (బాగారెడ్డి విగ్రహం) నుంచి విజయోత్సవ ర్యాలీ ప్రారంభం అయి జాతీయ రహదారి గుండా పట్టణంలోని శెట్కార్ ఫంక్షన్ హాల్ వరకు కార్యకర్తల జయ జయ ధ్వానాలతో ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాములు యాదవ్, కండెం నర్సింలు, నరసింహారెడ్డి, సురేశ్‌కుమార్ శెట్కార్ కుమార్తె గిరిజా శెట్కార్, హనుమంతరావు పాటిల్, రామలింగారెడ్డి, బిరాదార్ శ్రీనివాస్‌రెడ్డి, మక్సుద్, అశోక్ అప్పారావు, శుక్ల వర్ధన్‌రెడ్డి, నరేష్‌గౌడ్, ఎండి ఖాజా మియా, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బడిఈడు పిల్లకు బడి తప్పనిసరి

### జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు

**నర్సాపూర్ రూరల్, జూన్ 11, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండల పరిధి ఎల్లారెడ్డి గూడెం తండా పంచాయతీ పరిధిలోని జయరాం తండాలో పల్లె నిద్రలో భాగంగా రాత్రి బస చేశారు. ఉదయం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో ర్యాలి నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ తల్లి తండ్రులు తమ పిల్లల్ని పనికి కాకుండా బడికి పంపాలన్నారు. వారి భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలన్నారు. కార్పోరెట్‌కు దీటుగా మౌళిక వసతుల కల్పన ప్రభుత్వ పాఠశాలలో ఉందని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. బడి బయట ఉన్న పిల్లల్ని బడిలో చేర్పించాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

## గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు చేపడతాం

**పటాన్‌చెరు, జూన్ 11, ప్రభాతవార్త:** పటాన్‌చెరు, అమీన్‌పూర్ మండలాల పరిధిలోని అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రవేటు పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని మండల విద్యాధికారి రాథోడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రెండు మండలాల్లో ప్రభుత్వ గుర్తింపు, అనుమతులు లేకుండా ప్రవేటు పాఠశాలలను ప్రారంభించారని, అలాగే అడ్మిషన్ల తరగతుల ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. పాఠశాలలోనే పుస్తకాలు, టై,బెల్ట్,షూలు విక్రయిస్తున్నారని అలాంటి వాటిని తక్షణమె నిలిపివేయాలని తెలిపారు. ప్రభుత్వ నిభందనలకు విరుద్ధంగా నడుచుకున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లితండ్రులు సైతం తమ పిల్లలను ప్రవేటు పాఠశాల్లో చేర్చేటప్పుడు ఆ పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు ఉందా,లేదా పూర్తి వివరాలను తెలుసుకోవాలన్నారు. తమకు ఎలాంటి సందేహం వచ్చినా తక్షణమే అధికారులను సంప్రదించాలని సూచించారు.

## ప్రసాద్‌రెడ్డిని పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**దుబ్బాక(అక్బర్‌పేటభూంపల్లి), జూన్ 11, ప్రభాతవార్త:**చిట్టాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడు సోలిపేట ప్రసాద్‌రెడ్డి ఇటీవలే రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకున్న దుబ్బాక కాంగ్రెస్ నాయకులు పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్, పిఎసిఎస్ డైరెక్టర్ కాల్వ నరేష్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ ఉషయ్యగారి రాజిరెడ్డి, ఆకుల దేవేందర్‌లు కలసి మంగళవారం పరామర్శించారు. తొందరగా కొలుకుని అందరి మధ్యలోకి రావాలని కోరారు.

## పరిశుభ్రత తప్పనిసరి

**చిన్నశంకరంపేట,జూన్ 11,ప్రభాతవార్త:** గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని గజగట్లపల్లి గ్రామ ప్రత్యేక అధికారి లక్ష్మీ ప్రవిణ్ తెలిపారు. మంగళవారం ఆయన మండల పరిధి గజగట్లపల్లి గ్రామంలో పర్యటించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న మురికి కాలువలో నీరు నిలిచి దుర్వాసన వస్తుందని గ్రామస్తులు ఆయన దృష్టికి తిసుకెళ్లారు. స్పందించి వెంటనే కాలువలు శుభ్రం చేయించారు.

## ఆర్థిక సహాయం అందజేత

**చిన్నశంకరంపేట, జూన్ 11,ప్రభాతవార్త:** పట్టణ కేంద్రానికి చెందిన దడువాయి పరమేశ్వర్ ఇటీవల మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ తారక శ్రీధర్, రాధిక దయాగ్నో సెంటర్ తూప్రాన్ వారి సహకారంతో మంగళవారం బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. కాగా మృతుడు పరమేశ్వర్‌కు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. దాతలు ఎవరైన ముందుకు వచ్చి బాధిత కుటుంబానికి సహాయం అందించాలని వారు కోరారు.

## అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు మేలు

**మర్కుక్, జూన్ 11 (ప్రభాతవార్త):** తక్కువ ఖర్చు, అధిక దిగుబడి ఇచ్చే అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు రైతులకు ఎంతో మేలు అని ఏరువాక శాస్త్రవేత్తలు విజయ్, డాక్టర్ పల్లవిలు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఇప్పలగూడెంలో అధిక సాంద్రత పత్తి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పత్తి విత్తనాన్ని న్యూమాటిక్ ప్లాంటర్ సహాయంతో అధిక సాంద్రత పద్ధతితో పత్తి విత్తనాలను విత్తుకోవాలని సూచించారు. ఈ పద్ధతిలో వేసుకోవడం వల్ల తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణం విత్తుకోవచ్చని, మొలక శాతం కూడా పెరుగుతుందని, విత్తనం విత్తేటప్పుడు ఎరువులు కూగా వేసుకోవచ్చని తెలియజేశారు. మండల వ్యవసాయాధికారి టి.నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పద్దతిలోని వంగడాలు పంట కాలం తక్కువగా ఉండడం వల్ల కాయలు, పూత తొందరగా 20 నుండి 30 వరకు వస్తాయని అన్నారు. మొక్కలు ఏపుగా పెరగకుండా మేపిక్వాట్ క్లోరైడ్ అనే మందును పిచికారి చేసుకోవాలని పేర్కొన్నారు. ఎకరాకు 25 నుండి 30 కేజీల యూరియా, 15 కిలోల పొటాష్ ఎరువులను వేసుకోవాలని సూచించారు. సాధారణంగా హైబ్రిడ్ వంగడాలను రైతులు ఎకరానికి 4938 మొక్కల నుండి 7407 మొక్కల సంఖ్య ఉండడం వల్ల మొక్కలు బాగా పెరగడం, పంటకాలం కూడా పెరగం జరుగుతుందని తద్వారా గులాబి రంగు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుందన్నారు. కావున రైతులు అధిక సాంద్రత పద్దతిలోనే పత్తి సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాశి కంపెనీ ప్రతినిధులు మనోజ్, ఏఈఓలు విష్ణువర్ధన్, రజినికాంత్, రైతు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయాలి

**గజ్వేల్, జూన్ 11 (ప్రభాతవార్త):** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మంగళవారం గజ్వేల్ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ భవనంలో ఎమ్మార్పీఎస్ గజ్వేల్ అసెంబ్లీ కన్వీనర్ శనిగిరి రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు పెర్క పరశురాం, ఎంఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ, ఎంఎస్‌పి రాష్ట్ర నాయకుడు మైస రాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 7న ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మందకృష్ణ మాదిగ నేతృత్వంలో జరిగే ఆత్మగౌరవ కవాతుకు లక్షలాది మంది తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ప్రతి గ్రామం నుండి వందలాది మంది విద్యార్థులను తరలించాలన్నారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి జిల్లా నాయకత్వం గ్రామ గ్రామాన తిరిగి నూతన కమిటీలు ఏర్పాటుచేసి జెండా గద్దెలు నిర్మించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి శ్రీహరి సింధు, ఎమ్మార్పీఎస్ నాయకులు బొంది స్వామి, తప్పెట్ల రాములు, మినుముల కరుణాకర్, పోతగల్ల మహేష్ పాల్గొన్నారు.

# నార్సింగి అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తున్నాం

### మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్


మాట్లాడుతున్న నాగపూర్ణ శ్రీనివాస్

**నార్సింగి, జూన్ 11 ప్రభాతవార్త :** నార్సింగి మున్సిపల్ అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తున్నాము అని చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం చైర్ పర్సన్ అధ్యక్షతన నార్సింగి మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో నిర్మించబోయే సీసీ రోడ్లకు రూ.13.52 కోట్లు, డ్రైనేజి పనులకు రూ.8.45 కోట్లు, కమ్యూనిటీ హాల్‌కు రూ.22.12కోట్లు, వైకుంఠ ధామాలకు రూ.2.62కోట్లు, వీధి దీపాలకు రూ.2.55కోట్లు, గ్రీనరీ పనులకు రూ.కోటి, బోర్ సామాగ్రి, పారిశుద్య సిబ్బంది పనిముట్లు, ఇతర పనులకు గాను రూ.6.31.కోట్లు మొత్తం రూ.56.57కోట్ల పనులకు కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మాణం చేసింది. ఈ సందర్భంగా చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో కుల,మత,రాజకీయాలకు అతీతంగా పనులు చేస్తున్నామని తెలిపారు. ఏ వార్డులో ఏ సమస్య ఉన్నా కౌన్సిలర్ల దృష్టికి తీసుకు రావాలని, వెంటనే పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ప్రజలు ఏ విశ్వాసం ఉంచి మమ్ములను ప్రజా ప్రతినిధులుగా ఎంపిక చేసుకున్నారో... ఆ విశ్వాసంను మరింత పెంచుకునేందుకు అహర్నిశలు కష్టపడుతున్నామని తెలిపారు. పాలక కమిటీ సభ్యులు, అధికారులందరి సహకారంతో నార్సింగిని వేగంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ గోపాల విజయ్‌బాబు, కమీషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి కొంత మంది అధికారులు డుమ్మా కొట్టారు.


పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద

## విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ నేర్పించాలి

### ఎమ్మెల్యే వివేకానంద

**జీడిమెట్ల, జూన్ 11, ప్రభాతవార్త :** విద్యతో పాటు విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పించాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం శాసనసభ్యులు కేపీ వివేకానంద పాఠశాల యాజమాన్యానికి, ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం సుభాష్ నగర్ డివిజన్ వెంకటాద్రినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన భోది వృక్ష స్కూల్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాలమైన స్థలంలో అన్ని సదుపాయాలతో పాఠశాలను ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య విశిష్ఠ అతిథిగా హాజరైన కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలతా సురేష్‌రెడ్డి, బీజేపీ పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు ఎస్.మల్లారెడ్డి, రంగారావు, పొలె శ్రీకాంత్, టి.టి.కె. శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, నాగిరెడ్డి, తులసి, ఇస్మాయిల్, శేషు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సమాజాన్ని అధ్యయనం చేయాలి

**చిక్కడపల్లి, జూన్ 11 ప్రభాతవార్త:** విద్యార్థులు, సమాజాన్ని అధ్యయనం చేయడంతో పాటు అసమానతలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని వక్తలు పేర్కొన్నారు. చినుకు చినుకు పడుతూ ఉంటే, అబ్బనీ తీయనీ దెబ్బ పాటలు నాగేశ్వరరావు, విజయలక్ష్మిలు హుషారుగా పాడగా శ్రోతలు హర్షధ్వానాలతో ప్రశంసలు అందించారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులు ప్రారంభం అయ్యాయి.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ పాత్రికేయులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో ఆధిపత్యవర్గాల భావజాలం, అధికార భావజాలంగా ఉందని, బలహీనవర్గాలు, పేదలు వారికి అందాల్సిన సౌకర్యాలు దేశంలో అందడం లేదన్నారు. ఒక వర్గంపై పనిగట్టుకుని మరి విషప్రచారం దేశంలో చేస్తున్నారన్నారు. ప్రశ్నించడం అనేది కీలకమని, ప్రశ్నలతోనే సమాజం ముందుకు వెడుతుందన్నారు. దేశంలో పాలిస్తున్న పాలకులు తమ భావజాలం వ్యాప్తి చేసేందుకు, విద్య, చరిత్ర అన్ని అంశాలను వాడుకుంటున్నారని, అందుకే సమసమాజం రావడానికి విద్యార్థులు తమ అకాడమిక్ చదువులతో పాటు సమాజంలో జరిగే దోపిడీ, అసమానతలు, ఆధిపత్య ధోరణులకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడుతూ దేశంలో సమసమాజ స్థాపనకు పోరాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రానున్న కాలంలో బలమైన పోరాటాల నిర్వహణకు తరగతులలో అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్, శ్రీకాంత్‌వర్మ, ప్రశాంత్, శంకర్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు మమత, డి.కిరణ్, అశోక్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఎంప్లాయిస్ అండ్ టీచర్స్ అసోసియేషన్ సమావేశం

**పేట్‌బషీరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ శాఖ తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ అండ్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం సుచిత్ర, సాయి సంకల్ప నగర్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పలు తీర్మాణాలు చేశారు. పెండింగ్‌లో ఉన్న 3 డిఆర్‌లు (కరువు బత్యం) తొందరగా విడుదల చేయాలి. వేతన స్థిరీకరణ కమిటీ నుండి రిపోర్ట్ తెప్పించుకుని పిఆర్‌సిని విడుదల చేయాలి. హెల్త్‌కార్డ్స్ అన్ని ఆస్పత్రుల్లో అన్ని చికిత్సలకు వర్తించేటట్లు చూడాలి. కమ్యునికేషన్ 15 సంవత్సరాల రికవరి నుండి 12 సంవత్సరాలకు కుదించాలి. రూ. 398 వేతనంతో పనిచేసిన వాళ్లందరికి మంజూరి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ట్రేటా నాయకులు సిహెచ్.బాలచందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎల్.మాణిక్యరెడ్డి, ప్రధాన కార్యదర్శి అంజయ్యగౌడ్, ఆర్థిక కార్యదర్శి దశరథరామశర్మ, ఉపాధ్యక్షులు జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని అదృశ్యం

**తార్నాక, జూన్ 11 ప్రభాతవార్త :** కాలేజీక్ ప్రాక్టికల్ కోసం వచ్చిన ఓ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్హెచ్‌ఓ. వహిద్ కథనం ప్రకారం..ఈ నెల 10న వారాసిగూడ ఉప్పర్ బస్తీకి చెందిన సి.వైష్ణవి(23) ఓ.యూలోని దూర విద్యాకేంద్రం కాలేజ్‌లో ప్రాక్టికల్ కోసం తన సోధరుడు కళాశాల వద్ద డ్రాప్ చేసి వెళ్లాడు. తిరిగి సాయంత్రం కాలేజ్‌కి వచ్చిన ఆమె సోధరుడికి వైష్ణవి కాలేజ్‌లో కనిపించలేదు. దీంతో ఆమెకు ఫోన్ చేయడంతో స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో ఆమె ఆచూకి కోసం వెతికినా కనిపించలేదు. ఆందోళనకు గురైన ఆమె తండ్రి రాజు పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## భక్తిరసంతో ఓలలాడించిన అన్నమాచార్య సంకీర్తనలు

**రవీంద్రభారతి, జూన్ 11 ప్రభాతవార్త :**
శ్రీ తాళ్లపాక అన్నమాచార్య 616వ జయంతి సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో సరసిజ థియేటర్, లేకిని రచయిత్రుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రముఖ గాయనీమణులు హేమాముక్తేశ్వరరావు, రాధిక, శివశ్రీ, శ్రీవాణి, పి.వి.ఎస్.కృష్ణకుమారి, ఇంద్రగంటి పద్మలత, మారెళ్ళ సావిత్రిలు పూర్ణచంద్రరావు కీబోర్డు, దామోదర్ తబలతో వాద్యసహకారం అందించగా వీనులవిందుగా ఆలపించిన అన్నమాచార్య సంకీర్తల ఆహుతులను భక్తిరసంతో ఓలలాడించాయి. అత్తలూరి విజయలక్ష్మి సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు డా. ఎం.కె.రాము, కలగా కృష్ణమోహన్, పి.ప్రసాద్, శోభా, తురగా జయశ్యామల తదితరులు ప్రముఖ పద్మ వీణానాద విభూషిణి ఈమని కళ్యాణిని ఘనంగా సత్కరించి మోచెర్ల రాజ్యలక్ష్మి విపంచి విద్వన్మణి పురస్కారం ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సాయిమాధురి, వి.ధనలక్ష్మి, అల్లూరి గౌరీలక్ష్మి, నందూరి సుందరీ నాగమణి, సరస్వతి, షామీర్ జానకి, సర్వమంగళగౌరి, వీణా తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ ట్రీట్‌మెంట్ కోసం

## ప్రభుత్వం నుంచి రూ.లక్ష మంజూరు

**హైదరాబాద్, జూన్ 11 ప్రభాతవార్త:** అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన మోహిదీ అహ్మద్ ఆలీకి రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఓసీ కింద మంజూరు చేసిన రూ.లక్ష చెక్కును మంగళవారం లబ్దిదారులకు స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అందించారు. నిమ్స్ ఆసుపత్రిలో మెడికల్ ట్రీట్‌మెంట్‌కు సంబంధించిన చికిత్సకు అవసరమైన ఖర్చులకు సంబంధించి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ చేసిన విజ్ఞప్తి మేరకు ఈ మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తుందని తెలుపుతూ జారీ చేసిన లేఖను బాధితులకు అందించారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్,జూన్ 11 ప్రభాతవార్త : విద్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 12వ తేదీ బుధవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలు వరకు జూ పార్కు ప్రధాన రహదారి,రంనాస్‌పుర,ప్రిన్స్ కాలనీ,బహదూర్‌పుర,రామా టాకీస్,కామాటిపుర,ఉస్మాన్ బాగ్ ప్రాంతాలలో 10.30 నుంచి 11.30 గంటలు వరకు విద్యత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు చార్మినార్ సిబిడి అధికారులు వెల్లడించారు.

## ఎర్రగుంటలో అక్రమ నిర్మాణాలను తొలగింపు


అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

**తార్నాక, జూన్ 11 ప్రభాతవార్త :** తార్నాక ఎర్రగుంట చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో కొందరు వ్యక్తులు నిర్మాణాలను చేయడంతో విషయం తెలుసుకున్న మారెడ్‌పల్లి మండల అధికారులు మంగళవారం అక్రమనిర్మాణాలను తొలగించారు. సర్వే నెం.121, 124లో ఉన్న ఎఫ్‌టిఎల్ భూముల విషయంలో కోర్టులో కేసు నడుస్తోంది. దీనిని ఏమి లెక్క చేయకుండా అక్రమార్కులు రాత్రి సమయాల్లో నిర్మాణం చేయడంతో స్థానికుల ఫిర్యాదుతో నిర్మాణాలను కూల్చివేశారు.

## మంత్రముగ్దులను చేసిన సినీ సంగీత విభావరి

**చిక్కడపల్లి, జూన్ 11 ప్రభాతవార్త:** గానగంధర్వ ఎస్‌పి.బాలసుబ్రహ్మణ్యం, సహగాయణీమణులతో కలిసి వివిధ చలనచిత్రాలలో నుంచి పాడిన పాటలు సంగీతప్రియులను మంత్రముగ్దులను చేశాయి. మంగళవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో శ్రీధ్యుతి మ్యూజికల్ అకాడమి నిర్వాహకులు గాయనీగాయకులు పేరి నాగేశ్వరరావు, పేరి విజయలక్ష్మి, ఇషాన్ ఫౌండేషన్, విజయ్ క్రియేషన్స్ సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహణలో యుకో బ్యాంక్ సౌజన్యంతో విఖ్యాత గాయకుడు పద్మవిభూషణ్, డాక్టర్ ఎస్‌పి.బాలసుబ్రహ్మణ్యం జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వీనులవిందు చేసే పాటలను జంటనగరాలకు చెందిన గాయనీ గాయకులు పాడి అందరి నుంచి ప్రశంసలు అందుకున్నారు. గాయనీ గాయకులు అరుగంటలకుపైగా పాటలు పాడి బాలు పట్ల వారికున్న అభిమానం చాటారు. శ్రీధర్ సహగాయనీ సౌమ్యతో కలిసి పాడిన స్వాతిముత్యం చిత్రంలోని 'సువ్వీసువ్వీ సువ్వాలమ్మా' పాటను రసభరితంగా ఆలపించారు. రమణమూర్తి, సుదర్శన్, శ్రీధర్, కళ్యాణీ, ప్రసన్న, కృష్ణవేణిలు పాడినపాటలు ఆకట్టుకున్నాయి. సభా కార్యక్రమంలో కళాపోషకులు నాగప్రసాద్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యకర్త పేరి నాగేశ్వరరావు, పేరి విజయలక్ష్మిలు స్వయంగా గాయకులే కాకుండా సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ఆదర్శంగా నిలిచారని అభినందించారు.

## సెమీస్‌కు చేరిన ప్రింట్ మీడియా టీం

### -పోరాడి ఓడిన శాట్స్ జట్టు


ప్రింట్‌మీడియా – స్పోర్ట్ అథారిటీ ఆఫ్ తెలంగాణ జట్లు

**హైదరాబాద్,జూన్ 11,ప్రభాతవార్త:**
వీడ్రీమ్స్ బిజ్‌టెక్ కార్పొరేట్ ఛాంపియన్‌షిప్‌లో ప్రింట్‌మీడియా సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం శివరాంపల్లిలోని విజయానంద్ గ్రౌండ్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ప్రింట్‌మీడియా టీమ్ 39పరుగులతేడాతో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్)పై ఘన విజయం సాధించింది. తొలుత టాస్‌గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ప్రింట్ మీడియా జట్టు నిర్ణీత 20ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. రవికుమార్ (36), రోనిత్‌సింగ్ (36) మెరుగ్గా రాణించారు. ఫణి కిశోర్ (3/27) మూడువికెట్లతో ఆకట్టుకున్నాడు. ఆతర్వాత లక్ష్యచేధనకు దిగిన శాట్స్ టీం 7వికెట్లు కోల్పోయి 147 పరుగులకే పరిమితమైంది. ఓపెన్ కుమార్ బాబు (54) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. మూడు వికెట్లతో జట్టు విజయంతో కీలకంగా వ్యవహరించిన ప్రింట్‌మీడియా ప్లేయర్ రాజశేఖర్(3/18)కు "మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్"దక్కింది. బుధవారం జరిగే సెమీస్‌లో డాక్టర్స్-11 జట్టుతో ప్రింట్‌మీడియా తలపడనుంది. ఈకార్యక్రమంలో శాట్స్ కోచ్‌లు రవి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## చెత్తను ఆటోలో వేసే విధంగా చూడాలి : డిసి

**అత్తాపూర్ జూన్11,ప్రభాతవార్త :**
బక్రీద్ పండుగ సందర్భంగా చెత్తచెదారం లేకుండా పరిసరాల శుభ్రంగా ఉంచుకోవాలని రాజేంద్రనగర్ జిహెచ్‌ఎంసి డిప్యూటి కమిషనర్ రవి కుమార్ పేర్కొన్నారు.మంగళవారం రాజేంద్రనగర్‌లోని జిహెచ్‌ఎంసి కార్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఎ,ఎస్‌ఎస్,డై ఎస్‌డబ్ల్యుఎంలతో డిప్యూటి కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డిసి రవి కుమార్ మాట్లాడుతూ.... బక్రీద్ పండుగ సందర్భంగా చెత్త ఎక్కడ కూడా వేయకుండా చెత్త ఆటోలోనే వేసే విధంగా ఆటోల ద్వారా ముందస్తు ప్రకటనలు చేయాలని అన్నారు. చెత్త తొలగింపు,నల్ల కవర్ల సేకరణపై దృష్టి సారించాలన్నారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## చెత్తకుప్పలో ఆడ శిశువు పిండం లభ్యం

**ఎల్.బి.నగర్, జూన్ 11 ప్రభాతవార్త:**
గుర్తుతెలియని ఆడ శిశువు పిండం లభ్యమయ్యింది. ఈ సంఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం.. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో తట్టిఅన్నారం లోని ఆదివాసి కాలనీలోని ఒక పాత ఇంటి పక్కన చెత్త ఉన్న ప్రదేశంలో ఒక పిండము (నెలలు నిండని ఆడ శిశువు)ను ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు చూశారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన నెలలు నిండని ఆడ శిశువు పిండాన్ని పరిశీలించారు. కాలనీ అధ్యక్షు డు రమావత్ మట్టయ్య ఇచ్చిన ఫిర్యాదు పోలీసు కేసునమోదు చేసి దర్యా ప్తు చేస్తున్నారు.


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న వసుంధర

## 'గానకళాప్రపూర్ణ' శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యుల శతజయంతి

**చిక్కడపల్లి, జూన్ 11 ప్రభాతవార్త:** శ్రీకళామంజరి, నవ్యనాటక సమితి సంయుక్త ఆధ్వర్యంలో 'సంగీతసాహిత్య కళానిధి', 'గానకళాప్రపూర్ణ' శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యుల శతజయంతి కార్యక్రమాన్ని 15న నిర్వహించబోతున్నట్లు నిర్వాహక సంస్థల ప్రతినిధులు బండారి రమేశ్, డాక్టర్ ఆచార్య ఫణీంద్ర, ఎం.లక్ష్మీమానసలు తెలిపారు. మంగళవారం చిక్కడపల్లిలో నవ్యసామితీసమితి కార్యాలయంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను తెలంగాణ రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉపసంచాలకులు జి.వసుంధర హాజరై ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ ఆవిష్కరణలో సమన్వయకర్త నిష్టల సుధామాల, డాక్టర్ ఇందిరాహేమ, వేమరాజు విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్ హాల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా ప్రభుత్వ పూర్వ సలహాదారులు, విశ్రాంత సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి.రమణాచారి హాజరవుతారని, కార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ ఎల్లా వెంకటేశ్వరరావు, డాక్టర్ రేవూరి అనంతపద్మనాభరావు, జి.వసుంధర తదితరులు పాల్గొంటారన్నారు. ఆనాటి సంగీత, సాహిత్యసమర్పణలో భాగంగా యర్రంశెట్టి ఉమామహేశ్వరరావుచే 'అష్టావధానం', ఆముదాల మురళీచే సాహితీ ప్రసంగం, కృష్ణమాచార్యుల శిష్యప్రశిష్యులచే సంగీత సమర్పణ, ఎన్‌సి.కౌశిక్ కళ్యాణ్‌చే సంగీత నీరాజనం ఉంటుందని లక్ష్మీమానస వివరించారు.

## 13వ శతాబ్దానికి చెందిన తెలుగు కవి గోన బుద్ధారెడ్డి

### -త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి


గోన బుద్ధారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జనార్ధనమూర్తి

**చిక్కడపల్లి, జూన్ 11 ప్రభాతవార్త:** పదమూడవవ శతాబ్దానికి చెందిన తెలుగు కవి గోన బుద్ధారెడ్డి అని త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అన్నారు. మంగళవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో తెలుగు కవి గోన బుద్ధారరెడ్డి యాదిలో కార్యక్రమంలో జరిగిన సంస్మరణ సభకు ముఖ్యఅతిథిగా కళావిఎస్.జనార్ధనమూర్తి హాజరై గోనబుద్ధారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ప్రసంగించారు. కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా సాహితీకిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, సహస్ర కంఠరవ, సాహితీవేత్త చిక్కారామరాజు, సంఘసేవకులు వంగాల బాలరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళావిఎస్.జనార్ధనమూర్తి మాట్లాడుతూ గోనబుద్ధారెడ్డి రచించిన రంగనాథ రామాయణమే తెలుగులో తొలి సంపూర్ణ రామాయణ కావ్యంగా తెలుగు నాట ఎంతో ప్రాచుర్యం పొందిందన్నారు. అంతకుముందు తిక్కన రచించిన నిర్వచనోత్తర రామాయణమే కాని సంపూర్ణ రామాయణం కానేకాదన్నారు. 13 శతాబ్దానికి చెందిన గోన బుద్ధారెడ్డి కాకతీయుల సామంతరాజుగా పనిచేశారని అన్నారు. అంగ్ల విద్య తెలుగు నాట ప్రవేశించని రోజుల్లో సంస్కృత భాషా పాఠకులు తప్ప మిగిలిన విద్యార్థులందరికీ చిన్నతనంలోనే పెద్ద పుస్తకం పట్టించి చదివించే వారని, ఇంతకి పెద్దపుస్తకం అంటే మూడు పుస్తకాలకు సామాన్యనామం అని, ఆ మూడు పుస్తకాలు కవిత్రయం వారి ఆంధ్రమహాభారం, గోన బుద్ధారెడ్డి కృతమైన రంగనాథ రామయణం, పోతన భాగవతం అని అన్నారు.

### ఆరెకటికలకు రూ.500కోట్లతో

## ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న అశోక్‌కుమార్

**చిక్కడపల్లి, జూన్ 11 ప్రభాతవార్త:** ఆరెకటికలకు రూ.500కోట్లతో రాష్ట్రంలో వెంటనే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆరెకటిక అభివృద్ధి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.భూంపల్లి అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆరెకటిక అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశంలో అశోక్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి ప్రసంగించారు. ఈ వర్గాలకు ప్రభుత్వం వైన్స్ టెండర్లలో 30శాతం ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని, బీసీ-డి నుంచి బిసి-ఎ హోదా కల్పిస్తూ జీవో జారీ చేయాలని, మటన్ షాపులకు ఉచితంగా విద్యుత్తును సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఆరెకటిక మహిళలకు రూ.3లక్షల బ్యాంక్ రుణం 90శాతం సబ్సిడీతో మటన్ క్యాంటీన్‌లు, చొక్కాబోటి కర్రీపాయింట్లను వెంటనే ఏర్పాటు చేయాలని, 90శాతం సబ్సిడీతో గొర్ల పంపిణీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు చేసినా, వినతిపత్రాలు ఇచ్చినా ఆరె కటికలకు న్యాయం జరగడం లేదని, ఏ ఒక్కటి పరిష్కారం నేటికి జరగలేదని, రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి కె.నందకిషోర్, గౌరవ అధ్యక్షుడు బి.కాజారామ్, యువత అధ్యక్షుడు కె.నవీన్, గ్రేటర్ హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలు స్వరస్వతి భాయి, కార్యనిర్వాహక కార్యద్శి మురహరికార్ పవన్‌కుమార్, కోశాధికారి కెడి.దినేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు కోయల్‌కార్ జహంగీర్, ఫిలిం డైరెక్టర్ జిజె.రాజు, రాకేశ్ మట్కేకార్, మిడ్జిల్ మండల అధ్యక్షుడు కె.నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల విక్రేతలు ముగ్గురు అరెస్ట్

**చార్మినార్, జూన్ 11 ప్రభాతవార్త :**
హైదరాబాద్ పాతబస్తీలో గుట్టు చప్పుడు కాకుండ మాదక ద్రవ్యాలు (డ్రగ్స్) విక్రయించటానికి ప్రయత్నించిన ముగ్గురిని యాంటి నార్కోటిక్ బ్యూరో అదుపు లోకీ తీసుకుంది. నిందితుల నుంచి 34 గ్రాముల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.బహదూర్‌పుర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌రఘునాథ్ కథనం ప్రకారం.....బెంగుళూరుకు చెందిన జునైద్, పాతబస్తీ చందూలాల్ బారాదరికి చెందిన రెహ్మత్, అంబర్ పేట్‌కు చెందిన అబ్రార్,ఫైజల్‌లు కలిసి ముఠాగా ఏర్పడ్డారు. అంబర్‌పేట్‌కు చెందిన ఫైజల్ బెంగుళూరు నుంచి డ్రగ్స్‌ను తీసుకు వస్తున్నాడు.అవసరం ఉన్న వారికి ఈ ముగ్గురు కలిసి మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్నారు. కాగా ఈ నెల 10వ తేదీన జునైద్,రెహ్మత్,అబ్రార్,ఫైజల్‌లు కలిసి హైదరా బాద్ పాతబస్తీ హాసన్‌నగర్ వద్ద డ్రగ్స్‌ను విక్రయించటానికి ప్రయత్నిస్తున్న సమయంలో యాంటి నార్కోటిక్ బ్యూరో అదుపులోకీ తీసుకుంది. వారి వద్ద నుంచి రెండు లక్షల రూపాయలు విలువ చేసే 34 గ్రాముల మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం బహదూర్‌పుర పోలీసులకు అప్పగించారు.ముగ్గురు నింధితులను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఇన్‌స్పెక్టర్ రఘునాద్ తెలిపారు.ఈ కేసును బహదూర్‌పుర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలను వివరిస్తున్న డిఇవో రాధాకిషన్

## బడి మానేసిన పిల్లలను బడిలో చేర్పించాలి

### జిల్లా విద్యాధికారి రాధాకిషన్

**కొల్చారం, జూన్ 11 ప్రభాతవార్త:** ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని అంసానిపల్లి గ్రామంలో మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి మండల ప్రత్యేక అధికారి, జిల్లా విద్యాధికారి రాధాకిషన్ ఇంటింటికీ తిరుగుతూ బడి మానేసిన పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు వివరించడం జరిగింది. ఈ సందర్భంగా రాధాకిషన్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సౌకర్యాలు ఉన్నాయని, ఉచిత యూనిఫామ్ తో పాటు పాఠ్య పుస్తకాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ స్పెషల్ ఆఫీసర్, జిల్లా విద్యాధికారి రాధాకిషన్, నోడల్ అధికారి సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు కృష్ణ, శ్రీకాంత్, ఉపాధ్యాయులు శశాంక్, యాదగిరి, చంద్రశేఖర్, ఆనంద్, మనోహర్, షాకిర్, భవాని, గీత, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

### పోతంశెట్టిపల్లిలో 'బడిబాట'



'బడిబాట'లో పాల్గొన్న డిఇవో,ఎంఇవో, ఉపాధ్యాయులు

**కొల్చారం, జూన్ 11 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి గ్రామం బడిబాటలో భాగంగా మంగళవారం ఉదయం పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి, ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు చదువు పట్ల అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి రాధాకిషన్, మండల విద్యాధికారి నీలకంఠం మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు నిండిన విద్యార్థిని విద్యార్థులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు పొద్దార్ మధుకర్‌రావు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, ఉపాధ్యాయులు సంగయ్య, శ్రీనివాస్, పోచయ్య, తులసి, కమల, జ్యోత్స్న, పంచాయితీ కార్యదర్శి అరుంధతి, సీఆర్పీలు చౌరిగారి సాయికుమార్, శ్రీనివాస్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

## ఆటో డ్రైవర్‌లకు క్యూఆర్ కోడ్‌ల అందచేత



ఆటో డ్రైవర్‌లకు మై ఆటో సేఫ్ క్యూఆర్ కోడ్‌లను అందచేస్తున్న ఎస్ఐ

**ఝరాసంగం, జూన్ 11, ప్రభాతవార్త:** మై ఆటో ఈస్ సేఫ్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆటో డ్రైవర్‌లకు ఎస్ఐ రాజేందర్ రెడ్డి క్యూఆర్ కోడ్‌లను అందచేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఆటోలో డ్రైవర్ సీటు వెనుకాల క్యూఆర్ కోడ్ అంటించి ఉంటుందని, డ్రైవర్‌తో ఎలాంటి సమస్యలు వచ్చిన క్యూర్ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే డ్రైవర్ పూర్తి వివరాలు తెలుస్తాయని, వెంటనే 100కు డయల్ చేస్తే ప్రయాణీకుల సమస్యల పరిష్కారానికి పోలీసులు తగు చర్యలు తీసుకుంటారని గుర్తు చేశారు.

## రెడ్డి కార్పొరేషన్ చైర్మన్‌గా వెంకటేశ్వర్‌రెడ్డిని నియమించాలి



మాట్లాడుతున్న రెడ్డి జెఎసి నేతలు

**బెజ్జంకి, జూన్ 11, ప్రభాతవార్త:** రెడ్డి కార్పోరేషన్ చైర్మన్‌గా బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డిని నియమించాలని మంగళవారం రెడ్డి జెఎసి మండల సభ్యులు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇరవై మూడెళ్లుగా పార్టీకి సేవలందిస్తూ పార్టీ గెలుపు కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రెడ్డి జెఎసిలను ఎకం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడంలో ప్రముఖ పాత్ర పోషించిన నాయకుడు వెంకటేశ్వరరెడ్డి అన్నారు. త్వరలో ఏర్పాటు చేసే రెడ్డి కార్పోరేషన్‌కు చైర్మన్‌గా బద్దూరి వెంకటేశ్వరరెడ్డిన నియమించాలని జిల్లా రెడ్డి జెఎసి ఉపాధ్యక్షులు ముక్కిస రత్నాకర్‌రెడ్డి, బెజ్జంకి మండల రెడ్డి జెఎసి యువత అధ్యక్షులు మిట్టపల్లి చెన్నారెడ్డి జిల్లా రెడ్డి జెఎసి సీనియర్ నాయకులు పోతిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, చిలువేరు శ్రీనివాస్‌రెడ్డి, ఒంటెల సంపత్‌రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అమర్‌నాథ్ యాత్ర ఎంతో పవిత్రమైంది

**సిద్దిపేట రూరల్, జూన్ 11, ప్రభాతవార్త :** అత్యంత మహిమాన్వితమైన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తీర్థయాత్రలో అమర్‌నాథ్ యాత్ర ఎంతో పవిత్రమైందని అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి అధ్యక్షులు కొర్తివాడ లక్ష్మణ్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. అత్యంత క్లిష్టమైన అమర్‌నాథ్ యాత్ర నిర్వహించే భక్తులకు భోజన వసతి కల్పించడం తామే చేసుకున్న పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామన్నారు. అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి అధ్వర్యంలో అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే భక్తుల కోసం అమర్‌నాథ్ సేవా మండలి అమృత్సర్ సహకారంతో బాల్తార్ వద్ద అలాగే భోలే బండారి చారిటబుల్ ట్రస్టు సహకారంతో పంచతరని వద్ద ప్రత్యేక లంగర్లు ఏర్పాటు చేస భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. ఈనెల 12న సిద్దిపేట శరభేశ్వర అలయం నుంచి లారీలు బయలుదేరుతాయన్నారు. సరుకల లారీని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభిస్తారని తెలిపారు. 8 గంటలకు శరభేశ్వర అలయంలో శివ కల్యాణోత్సవం, 11 గంటలకు వాహనపూజ కార్యక్రమంతోపాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అమర్‌నాథ్ వెళ్లే భక్తులందరూ బాల్తార్ వద్ద గల 8వ నంబర్ లంగర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో నేతి కైలాసం, మధుసూదన్, పరమేశ్వర్, రమేష్, భూపతి తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కొర్తివాడ లక్ష్మణ్

# ఆశాలకు ఎగ్జామ్స్ పెట్టే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

### ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు నర్సమ్మ

**కొల్చారం, జూన్ 11 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఆశాలకు ఎగ్జామ్స్ పెట్టే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు కె.నర్సమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం కొల్చారంలో ఆశా డే సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఎంహెచ్‌పీ మోహన్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆశా వర్కర్లు గిరిజన ప్రాంతాల్లో 33 సంవత్సరాల నుండి పనిచేస్తున్నారని, ప్రారంభం నుండి ఇప్పటివరకు అనేకరకాల ప్రభుత్వం ఇచ్చిన ట్రైనింగ్‌లు పొందారన్నారు. రిజిష్టర్లు రాయడం, ఆన్‌లైన్ పనిచేయడం, ప్రజలకు మందులను అందజేయడం, గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు, ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని, కరోనాను నియంత్రించడంలో ఆశా వర్కర్లు ముఖ్యభూమిక పోషించారన్నారు. వీరికి ప్రపంచ ఆరోగ్య సంస్థ లీడర్స్ అవార్డు ప్రకటించిందన్నారు. ప్రభుత్వం ఎగ్జామ్స్ నిర్వహణకు వ్యతిరేకంగా ఆశాలు రాష్ట్ర వ్యాప్త ఆందోళన పోరాటాలు చేసిన వైద్యశాఖ మంత్రి, ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం కనీస వేతనం 18 వేల రూపాయలకు పెంచి ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలన్నారు. ప్రతి నెల రెండవ తేదీనే వేతనాలు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సర్వేల డబ్బులు వెంటనే చెల్లించాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ, రిటైర్‌మెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, గీత, సబిత, సంసీల, నాగమణి, చంద్రకళ, నషమ్మ, రమ్య, మాధవి, అశాలు తదితరులు ఉన్నారు.



ఎంహెచ్‌పీ మోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు



మాట్లాడుతున్న బంక చందు

## కౌశిక్‌రెడ్డి మంత్రికి క్షమాపణ చెప్పాలి

**హుస్నాబాద్, జూన్ 11,ప్రభాతవార్త :** హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వెంటనే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బంక చందు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కౌశిక్‌రెడ్డి బిఆర్ఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొన్నంపై చేసిన ఆరోపనలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పొన్నం తప్పుచేసినట్లు ఏదైనా ఆదారాలు ఉంటే భయటపెట్టి మాట్లాడాలన్నారు. ఆధారాలు లేకువండా ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అక్కన్నపేట మండల అధ్యక్షులు ఐలయ్య, నాయకులు వల్లపు రాజు, కుమార్, బాలయ్య, అనిల్, శ్రీకాంత్, శ్రీనివాస్,హరీష్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## బస్సు ఢీకొన్న సంఘటనలో మరో మహిళ మృతి

**అక్కన్నపేట, జూన్ 11, ప్రభాతవార్త :** సోమవారం మండల కేంద్రంలో బస్సు బైక్ ఢీకొన్న సంఘటనలో ఒక మహిళ కరోంటోతు కవిత అక్కడికక్కడే మృతి చెందగా తీవ్ర గాయాలతో ఉన్న కరోంతోతు స్వరూపను కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎమ్‌జిఎమ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ స్వరూప మంగళవారం చికిత్స మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## కనుల పండుగగా జమదగ్ని రేణుక ఎల్లమ్మదేవిల కళ్యాణం



రేణుక జమదగ్నిల కళ్యాణ ఘట్టంలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు

**నర్సాపూర్ జూన్ 11, ప్రభాతవార్త:** పట్టణంలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ 13వ వార్షికోత్సవాలను మంగళవారం గౌడ సంఘం సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిపూజ, పుణ్యావాచనం, నవగ్రహపూజ, ఋత్విక్వహవనం, ధ్వజారోహణం, వాస్తుగ్రహ సర్వతోభద్ర మంటపారాదన, అగ్ని ప్రతిష్ట, జలాబిషేకంతో పాటు మధ్యాహ్నం శ్రీజమదగ్ని సహిత రేణుకా ఎల్లమ్మదేవి కళ్యాణం భక్తి శ్రద్దలతో ఘనంగా జరిగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నవితరణ జరిగింది. ఈకార్యక్రమాలను పూజారి మురళీకృష్ణ పంతులు వేద మంత్రాల మధ్యన జరిగాయి. ఉత్సవాలకు ఎమ్మెల్యే సునీతారెడ్డి, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నహిమొద్దీన్, బిఆర్ఎస్ నాయకులు సత్యంగౌడ్, బాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అద్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, బిజెపి నాయకులు గోద రాజేందర్, కౌన్సిలర్ బుచ్చేష్‌యాదవ్, పెద్ద రమేశ్‌గౌడ్, తదితరులు వేర్వేరుగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో నర్సాపూర్ వన్సిఫల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్‌గౌడ్, గౌడ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, మాజీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్,సత్యంగౌడ్, బిక్షపతిగౌడ్, రాంచందర్‌గౌడ్, విజయ్ గౌడ్,,శ్రీనివాస్ గౌడ్,రామకృష్ణా గౌడ్,, గోపి గౌడ్, రామస్వామి గౌడ్,, నాగేందర్ గౌడ్,, భాను గౌడ్,, కృష్ణా గౌడ్,, స్వామి గౌడ్,,వెంకటస్వామి గౌడ్,,సత్యనారాయణ గౌడ్,, అర్జున్ గౌడ్,,గౌడ సంఘం నాయకులు, సభ్యులు ,కుల పెద్దలు తదిరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు కాడెద్దు మృతి

**చేర్యాల, జూన్ 11,ప్రభాతవార్త :** చేర్యాల మండలం తాడూరు గ్రామానికి చెందిన వడ్లకొండ రంగయ్య రైతుకు చెందిన కాడెద్దు పిడుగు పడటంతో మృతి చెందింది. మంగళవారం సాయంత్రం తన పొలం వద్ద ఎద్దు మేత మేస్తున్న క్రమంలో ఉరుముల,మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా పిడుగు పడటంతో ఎద్దు మృతి చెందిందని,కాడెద్దు విలువ సుమారు రూ.90వేలు ఉంటుందని ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని తాజా మాజీ సర్పంచ్ నర్ర ప్రేమల మహేందర్‌రెడ్డి కోరారు.




వనంపల్లిలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

## వనంపల్లిలో బడిబాట

**ఝరాసంగం, జూన్ 11, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వనంపల్లి ఎంపియుపిఎ పాఠశాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు గ్రామంలోని తల్లి దండ్రులు పలు సూచనలు చేస్తూ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలకే పంపాలని, ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యను అందుకోగలుగుతారన్నారు. ప్రయివేటు పాఠశాలలకు పంపి ఆర్థికంగా ఇబ్బందులు పడవద్దని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా నోటు, పాఠ్యపుస్తకాలు,ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం మధ్యాహ్న భోజనం, 2 జతల ఏకరూప దుస్తువులు ఉచితంగా అందిస్తామని వివరించారు.

## ఎమ్మార్పీ ధరలకే విత్తనాలు అందచేయాలి : ఎడివో



ఫర్టిలైజర్ దుకాణాన్ని పరిశీలిస్తున్న ఏడిఓ నూతన్ కుమార్

**నాగల్‌గిద్ద, జూన్ 11, ప్రభాతవార్త:** రైతులకు ఎరువులు, విత్తనాలు ఎమ్మార్పీ ధరలకే అందించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు నూతన్ కుమార్ సూచించారు. నాగల్‌గిద్దలో మండల వ్యవసాయాధికారి వెంకటేశంతో కలసి ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణం నిర్వాహకులకు నూతన్ కుమార్ పలు సూచనలు సలహాలు అందచేశారు. దుకాణంలో స్టాక్‌కు సంబంధించి రిజిస్టర్‌లో ఎప్పటి వివరాలు అప్పుడే నమోదు చేయాలన్నారు. దుకాణంలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీలర్లు జనార్ధన్‌రెడ్డి, రమేష్ తదితరులు ఉన్నారు.

### సిర్గాపూర్‌లో...

**సిర్గాపూర్, జూన్ 11, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాన్ని వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడిఏ) నూతన్ కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని రైతులకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని డీలర్లకు సూచించారు. దుకాణంలో స్టాక్ రిజిష్టార్, బిల్ బుక్స్‌లు సక్రమంగా నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. అధిక ధరలక ఎరువులు విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని నూతన్ కుమార్ డీలర్‌లకు హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శశాంక్ ఉన్నారు.

## ఆర్డీవోను కలిసిన లోక్‌సత్తా నేత

**నర్సాపూర్ జూన్ 11, ప్రభాతవార్త :** ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డిని మంగళవారం లోక్‌సత్తా పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ మిర్యాల చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా కళిశారు. ఈ సందర్భంగా ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డితో రైతులకు పంటల పెట్టుబడి సహాయం, ధాన్యం కొనుగోలుకు సంబంధించిన విషయాలు, అలాగే రైతు సమస్యలపై వారు చర్చించారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మిర్యాల చంద్రశేఖర్ ఆర్డీవోను కోరారు. ఈ సందర్భంగా మిర్యాల చంద్రశేఖర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ని శాలువాతో సత్కరించారు. ఈ కార్యనరకమంలో పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవోతో మిర్యాల చంద్రశేఖర్ తదితరులు

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టిఎన్‌జివో ముందుంటుంది

### యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరమేశ్వర్, విక్రమ్‌రెడ్డి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టిఎన్జీవోల యూనియన్ ఎల్లప్పుడు ముందుంటుందని జిల్లా అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కొమాండ్ల విక్రమ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అమలుచేస్తున్న పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడంతో ఉద్యోగులందరూ ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. సిద్దిపేట జిల్లాను ఇతరులకు అదర్శంగా నిలుపాడానికి ఉద్యోగులు నిరంతరం కృషి చేస్తున్నారని వివరించారు. సంఘంలో ప్రతి ఒక్కరూ విధిగా సభ్యత్వం తీసుకోవాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం బకాయిలుగా ఉన్న డిఎలను విడుదల చేయాలని సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. ఉద్యోగులకు పిఆర్‌సి ప్రకటించాలని ఈహెచ్‌ఉస్ సౌకర్యం కల్పించాలని ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని తీర్మానించినట్లు వారు వివరించారు. జిల్లా టిఎన్జీవోస్ సంఘానికి కలెక్టరేట్ వద్ద రెవెన్యూ సంఘానికి కేటాయించిన విధంగా 5 ఎకరాలు కేటాయించాలని జిల్లా ఉద్యోగులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని తీర్మానం చేయడంతో పాటు 317 జీవోలో ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని తీర్మానించినట్లు తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు నిమ్మ సురేందర్‌రెడ్డి, అశ్వక్ అహ్మద్, వెంకటేశ్వర్లు, తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు, ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు, ప్రతినిధులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న టిఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్

## సుభాష్‌చంద్రబోస్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**బెజ్జంకి, జూన్ 11, ప్రభాతవార్త :** మండల పరిధిలోని బెజ్జంకి క్రాసింగ్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సుభాష్‌చంద్రబోస్ విగ్రహాన్ని మంగళవారం ఎమ్మెల్యే డా॥కవ్వంపల్లి సత్యనారాయణ స్థానిక నాయకులతో కలిసి అవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడని తెలిపారు. ప్రతి ఒక్కరూ సుభాష్‌చంద్రబోస్ అడుగుజాడల్లో నడుచుకోవాలన్నారు. అనంతరం గుండారంలో కురుమ సంఘం అధ్వర్యంలో నిర్వహిస్తున్న బీరప్ప జాతరకు వెళ్లి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయన వెంట నాయకులు ఒగ్గు దామోదర్, చెప్యాల శ్రీనివాస్‌గౌడ్,శానగొండ శ్రావణ్, రాజశేఖర్‌రెడ్డి, శరత్, చెన్నారెడ్డి, సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా కమిషనర్‌ను అవమానించడం సరికాదు

### కాంగ్రెస్ నేత దరిపల్లి చంద్రం

**సిద్దిపేట రూరల్, జూన్ 11,ప్రభాతవార్త :** సిద్దిపేట మున్సిపాల్ సర్వసభ్య సమావేశంలో మహిళకమిషనర్ అని చూడకుండా బిఆర్ఎస్ కౌన్సిలర్లు అగౌరవపర్చడం సరికాదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దరిపల్లి చంద్రం అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ కౌన్సిలర్లు ఇంకా అధికారంలో ఉన్నామన్న భ్రమలోనే ఉన్నారని మండిపడ్డారు. మున్సిపల్ సర్వసభ్య సమావేశ సమయంలో వేదికపై చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు కమిషనర్ కూర్చుల్లో ఉండగా బిఅర్ఎస్ కౌన్సిలర్లు కావాలనే మహిళ కమిషనర్ అని చూడకుండా వేదిక నుంచి కిందికి దింపి వేదిక ముందు అధికారులతో కూర్చుమనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మహిళ కమిషనర్‌ను అవమానపర్చిన బిఆర్ఎస్ కౌన్సిలర్లు వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. మున్సిపాలిటీలో బిఅర్ఎస్ కౌన్సిలర్ల అటలు సాగతలేవన్న దురుద్దేశ్యంతో మహిళ కమిషనర్‌ను అవమానించారని అరోపించారు. ఇప్పటికైనా బిఅర్ఎస్ కౌన్సిలర్లు తమ పద్దతి మార్చుకొని సిద్దిపేట పట్టణ అభివృద్ధితో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

## 14న పశువుల కూరగాయల అంగడి వేలం పాట

**బెజ్జంకి, జూన్ 11, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే పశువుల సంత, కూరగాయల అంగడి వేలంపాటను ఈనెల 14న ఉదయం బెజ్జంకి గ్రామ పంచాయతీ వద్ద నిర్వహించడం జరుగుతుందన్నారు. వేలం పాటలో పాల్గొనేవారు పశువుల అంగడికి రూ.20 వేలు, కూరగాయల మార్కెట్‌కు రూ.12 వేలు డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనాలని ప్రత్యేక అధికారి పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

## నిధుల మంజూరుకు జలమండలి ఎండికి ప్రతిపాదనలు



జలమండలి ఎండి సుదర్శన్‌రెడ్డికి ప్రతిపాదన పత్రం అందచేస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, జూన్ 11, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్‌లోని సీవరేజ్ సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ పుష్పనగేష్ మంగళవారం జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ సుదర్శన్ రెడ్డికి ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా పుష్పనగేష్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో నూతన డ్రైనేజీ నిర్మాణానికి 3.5 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని వినతిపత్రం అందచేశామన్నారు. రామచంద్రారెడ్డినగర్, కాకతీయనగర్, అశోక్ నగర్, జ్యోతినగర్, రామచంద్రాపురం, శ్రీనివాస్‌నగర్, ఓల్డ్ రామచంద్రాపురం, మల్లికార్జున్‌నగర్, వినాయక్‌నగర్‌లో తీవ్ర ఇబ్బందిగా మారిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి నిధుల మంజూరు గురించి ప్రతిపాదనలు చేశామన్నారు. త్వరలో నిధులు మంజూరు చేసేందుకు జలమండలి ఎండి సుదర్శన్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు కార్పోరేటర్ పేర్కొన్నారు.

## ఎంపిటిసి సభ్యులను సన్మానించిన ఎమ్మెల్యే



ఎంపిటిసి సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్ టౌన్, జూన్ 11, ప్రభాతవార్త:** ఎంపిటిసి సభ్యుల పదవీ కాలం ముగియడంతో చివరి మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎంపిటిసి సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మంగళవారం సన్మానించారు. 5 సంవత్సరాలు ప్రజా సేవ చేసిన ఎంపిటిసి సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి చాందీ బాయి, జడ్పీటిసి లక్ష్మీబాయి, ఎంపిటిసి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## మండలంలో ప్రారంభమైన ఖరీఫ్ సాగు



పత్తి విత్తనాలను విత్తుకుంటున్న రైతులు

**ఝరాసంగం, జూన్ 11 ప్రభాతార్త :** మండలంలోని రైతులు ఖరీఫ్ పంటల సాగులో బిజీబిజీగా ఉన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో 39,650 ఎకరాల్లో రైతులు పంటలను సాగుచేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నారు. తొలకరి జల్లులు పలుకరించడంతో రైతులు కూలీల సహకారంతో తమ వ్యవసాయ భూముల్లో పత్తి, సోయ పంటలను విత్తుకుంటున్నారు. గత సంవత్సరం సకాలంలో వర్షాలు పడక ఆశించిన దిగుబడి రాక, వచ్చిన పంట దిగబుడికి గిట్టుబాటు ధర అందదక అన్నదాతలు అవస్థలు పడ్డారని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ మారు వర్షాలు బాగా కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంటుండటంతో రైతన్నలు ఇక తమ సమస్యలు తీరుతాయన్న ఆశతో పంటలను విత్తుకుంటున్నారు.

## మై ఆటో సేఫ్‌తో ప్రయాణీకులకు భద్రత : డిఎస్‌పి

**జహీరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** పోలీసుశాఖ ప్రవేశపెట్టిన మై ఆటో ఈస్ సేఫ్ కార్యక్రమంతో ప్రయాణీకులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పోలీసు ఠాణాలో మై ఆటో సేఫ్ అనే కార్యక్రమాన్ని జిల్లా ఎస్‌పి రూపేష్ చెన్నూరి ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఆటోలో డ్రైవర్ సీటు వెనుకాల పోలీసు శాఖ క్యూఆర్ కోడ్ అతికించి ఉంటుందని, క్యూఆర్ కోడ్‌లో ఆటో యజమాని, డ్రైవర్‌కు సంబంధించిన పూర్తి వివరాలు అందుబాటులో ఉంటాయన్నారు. జహీరాబాద్ డివిజన్‌లో 400 ఆటోలకు క్యూఆర్ కోడ్‌లను అందచేసినట్లు పేర్కొన్నారు. ఆటో డ్రైవర్‌తో ఎలాంటి సమస్యలు వచ్చినా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వివరాలు తెలుసుకుని సమస్య పరిష్కారానికి 100కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సిఐ రాజబోయిన రవి, రూరల్ సిఐ నయీమొద్దిన్, పట్టణ, రూరల్, చిరాగ్‌పల్లి, ఝరాసంగం, కోహీర్, రాయికోడ్, హద్నూర్ పోలీసు ఠాణాల ఎస్‌ఐలు లక్ష్మారెడ్డి, వరప్రసాద్, నరేష్, రాజేందర్‌రెడ్డి, కిష్టయ్య, వెంకట్‌రెడ్డి, రామానాయుడు ఉన్నారు.



ఆటో డ్రైవర్లకు మై ఆగో ఈస్ సేఫ్ క్యూఆర్ కోడ్‌ను అందచేస్తున్న డిఎస్‌పి